

సైనిక సంక్షేమానికి కృషి
- మేజర్ జనరల్ అజయ్ మిశ్రా

ప్రజాశక్తి - కడప అర్బన్


మాట్లాడుతున్న అజయ్‌మిశ్రా

సైనిక సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మేజర్ జనరల్ అజయ్ మిశ్రా అన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మాజీ సైనికుల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. సైనిక సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. మహాసభలో కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన 9 మంది మందిని సత్కరించడంతో పాటు, వారికి చీర, మెమెంటో, సెమీ ఆటోమేటిక్ వాషింగ్ మెషీన్లు బహుకరించారు.

సర్వం సిద్ధం

- నేటి నుంచి పదవ తరగతి పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- 6 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తింపు
- కేంద్రాలను పరిశీలించిన డిఇఒ


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఇఒ షంషుద్దీన్

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా వ్యాప్తంగా పదవతరగతి పరీక్షలు ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. 6 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా 161 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీలు ఉంటాయి. జిల్లా వ్యాప్తంగా 27,800 మంది విద్యార్థులు పరీక్షాలకు హాజరు కానున్నారు. ఇందులో బాలురు 14,330 మంది, బాలికలు 13,470 మంది ఉన్నారు. పరీక్షా కేంద్రానికి విద్యార్థులు గంట ముందు చేరుకోవాలి. అరగంట ముందు పరీక్షా కేంద్రాలోకి విద్యార్థులను అనుమతిస్తారు. పరీక్ష పూర్తయ్యే వరకు విద్యార్థులను కేంద్రం నుంచి బయటకు పంపియారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ ఫోన్, స్మార్ట్ వాచీలకు అనుమతి లేదు. మాస్‌కాపీయింగ్‌కు ఎలాంటి అవకాశాలు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణం

పదవత తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్‌టిసి అధికారులు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. కండక్టర్‌కు విద్యార్థులు హాల్ టికెట్ చూపించాలి.

144 సెక్షన్ అమలు

పరీక్షలు నిర్వహించే కేంద్రాల వద్ద పోలీస్ అధికారులు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. దీంతో పాటు కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో హెల్ప్‌లైన్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఈనెల 17 నుంచి పరీక్షలు ముగిసే వరకు నంబర్లు 7093526499, 9505810113 సంప్రదించవచ్చు. విద్యార్థులు, విధి నిర్వహణలో ఉన్న ఉపాధ్యాయులు కంట్రోల్ రూం సేవలను ఉపయోగించుకోవచ్చు. సలహాలు, ఫిర్యాదులు తెలియజేయవచ్చు.

రాష్ట్ర పరిశీలకులు రాక

జిల్లాలో పరీక్షల తీరును పరిశీలించేందుకు రాష్ట్రం నుంచి ప్రభుత్వ పుస్తకాలు డైరెక్టర్ మధుసూధన్‌రెడ్డి హాజరు కానున్నారు. పదవతరగతి పరీక్షలు నిర్వహించే కేంద్రాలను డిఇఒ షంషుద్దీన్, అసిస్టెంట్ డైరెక్టర్ మునీర్‌ఖాన్ పరిశీలించారు.

మోడీకి ప్రజా ప్రతిఘటన తప్పదు

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్

ప్రజాశక్తి - కడప అర్బన్

సిపిఎం ఎన్నికల సీట్ల సర్దుబాట్లు రాష్ట్రాల వారీగానే ఉంటాయని, బిజెపి వ్యతిరేక విశాల ఐక్యవాదులకు సిపిఎం నాయకత్వం వహిస్తుందని, పరమత ద్వేషాన్ని ప్రచారం చేస్తున్న మోడీకి ప్రజా ప్రతిఘటన తప్పదని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఆర్.కె. నగర్‌లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ విస్తత సమావేశం షేక్.గౌసియాబేగం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ ఇండియా బ్లాకు కూటమి 2024, దేశ 18వ సార్వత్రిక ఎన్నికలు నాటికి పూర్తయిందని, దాని కొనసాగింపు కార్యక్రమాలు, నిర్మాణం నేడు ఏమీ దేశంలో లేవని తెలిపారు. భవిష్యత్తులో దేశంలో, రాష్ట్రంలో జరిగే ఎటువంటి ఎన్నికలలో నైనా సిపిఎం పొత్తులు ఒకే రకంగా ఉండవని స్పష్టం చేశారు. స్థానిక పరిస్థితులు బట్టి ఉంటాయని, దేశవ్యాప్తంగా 2025, ఏప్రిల్ 2 నుంచి 6వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలోని మధురైలో నిర్వహించే 24వ సిపిఎం జాతీయ మహాసభల్లో స్పష్టమైన రాజకీయ విధానం రూపొందించనున్నట్లు చెప్పారు. సిపిఎంకు కేరళలో ప్రధాన రాజకీయ ప్రత్యర్థి కాంగ్రెస్ అని, పశ్చిమ బెంగాల్లో ప్రధాన రాజకీయ ప్రత్యర్థి త్రుణమూల్ కాంగ్రెస్ అని పేర్కొన్నారు. దేశంలో భవిష్యత్ కార్యాచరణ సిపిఎం బలం పెంచుకోవడం, విశాల ప్రజా ఐక్యవేదికలు నిర్మాణం, వామపక్ష ఐక్య వేదికలు బలపడడానికి ప్రధాన ఆచరణాత్మక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. దేశంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ లు పరమత ద్వేషాన్ని ప్రచారం చేస్తున్నాయని, దీనికి వ్యతిరేకంగా లౌకిక ప్రజాస్వామ్య శక్తులను ఐక్యం చేయటం సిపిఎం భవిష్యత్తు కార్యాచరణ అన్నారు. ఢిల్లీ ఎన్నికలలో ఇండియా బ్లాక్‌లోని కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ తలపడి బిజెపి చేతిలో పెట్టారన్నారు. ఇండియా బ్లాక్ ఏర్పడక ముందే బీహార్లో, తమిళనాడులో భావసారుప్యత కలిగిన పార్టీల మధ్య ఐక్య ఫ్రంట్ లు ఉన్నాయని గుర్తు చేశారు. మతోన్మాదంపైన, నూతన ఆర్థిక సరళీకరణ విధానాలపైన పోరాడాల్సిన బాధ్యత కమ్యూనిస్టు శ్రేణులపై ఉందని పేర్కొన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, కార్యదర్శివర్గ సభ్యులు ఏ.రామ్మోహన్, బి.మనోహర్, వి.అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాసులు రెడ్డి, బి.దస్తగిరి రెడ్డి, పి.చాంద్ బాషా, కె.సత్యనారాయణ, కె.శ్రీను, రాహుల్, లక్ష్మీదేవి, నాయకులు ఎన్.భైరవ ప్రసాద్, జి.సునీల్‌కుమార్, నరసయ్య, రమణ, సిపిఎం సీనియర్ నాయకులు ఐ.ఎన్. సుబ్బమ్మ, వివిధ ప్రజా సంఘాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్

ప్రజాశక్తి- కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యా మండలి ఆదేశాల మేరకు స్పాట్ వాల్యుయేషన్ ఈనెల 17న ప్రారంభమవుతుందని ఆర్‌ఐఒ వెంకటసుబ్బయ్య ఒక ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్ఆర్ జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ స్పాట్ వాల్యుయేషన్ డ్యూటీ కోసం అధ్యాపకులను రిలీవ్ చేయాలని పేర్కొన్నారు. బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ నుంచి ఇంగ్లీష్, తెలుగు, హిందీ, సివిక్స్, గణితంలో చీఫ్ ఎగ్జామినర్లు, ఎగ్జామినర్లుగా నియమితులైన అధ్యాపకులను సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు తప్పనిసరిగా రిలీవ్ చేయాలని తెలిపారు. అధ్యాపకులు 17న మధ్యాహ్నం 12:00 గంటలకు స్పాట్ వాల్యుయేషన్ క్యాంప్‌లో హాజరుకావాలని పేర్కొన్నారు. హాజరు అయిన అనంతరం వాల్యుయేషన్ పై అవగాహన సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. అధ్యాపకులను రిలీవ్ చేయని కళాశాలలపై బోర్డు ద్వారా జరిమానా విధించబడుతుందని పేర్కొన్నారు.

గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - కడప అర్బన్

గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గంగాధర పేర్కొన్నారు. ఆదివారం రిమ్స్ రోడ్డులో ఉన్న గిరిజన భవన్‌లో జాతీయ అధ్యక్షులు పి.వి.రమణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖల్లో ఎస్సీ ఎస్టీ బ్యాక్‌లాగ్ ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. జాతీయ అధ్యక్షులు రమణ మాట్లాడుతూ జిల్లా పరిధిలో పరిష్కారంకానీ సమస్యలను రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, కార్యదర్శి డాక్టర్ రామకృష్ణ, జిల్లా గౌరవాధ్యక్షులు సుంకన్న సహా అధ్యక్షులు బాబు నాయక్, డాక్టర్ వెంకట్, సీనియర్ నాయకులు వీరన్న, జిల్లా ఆర్థిక కార్యదర్శి డాక్టర్ పి మధుసూదన్ పాల్గొన్నారు.

కబ్జాదారులకు వంతపాడుతున్న రిజిస్ట్రేషన్ అధికారులు
- సిఎం, డిప్యూటీ సిఎం, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం
- దళిత ఫోరం నేత బూసిపాటి కిషోర్

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నగర పరిధిలో కబ్జారాయుళ్లకు వంతపాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలను తుంగలో తొక్కి మరి రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు నీటిమునక భూములను రిజిస్ట్రేషన్ చేస్తున్నారని దళితఫోరం నేత బూసిపాటి కిషోర్ ఆరోపించారు. ఆదివారం నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నచౌక్ పరిధిలోని కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఆర్ట్స్ కాలేజ్ ఎదురుగా సర్వే నంబర్ 955లో గల 23 సెంట్లు భూమిని యథేచ్ఛగా కబ్జాదారులు తప్పుడు పత్రాలతో భూమిని కబ్జా చేశారన్నారు. ఈ భూమి ప్రభుత్వ రికార్డుల్లో నీటి మునక భూమిగా రిజిస్ట్రేషన్ అయిందన్నారు. ఈ భూములను రిజిస్ట్రేషన్ చేయవద్దంటూ సుప్రీంకోర్టు స్పష్టంగా ఇదివరకే ఆదేశాలు ఇచ్చిందన్నారు. కానీ అధికార పార్టీకి చెందిన ఓ నేత అండదండలతో కబ్జాదారులు తప్పుడు పత్రాలు సృష్టించి ఈ భూమిని కబ్జా చేశారన్నారు. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ప్రధాన రహదారిలో ఉండడంతో ఇక్కడ భూమి ధర సెంటు రూ.40 లక్షలు ఉందని, విలువైన భూమి కావడంతో కబ్జారాయుళ్ల ఈ భూమిపై కన్నేశారన్నారు. ఈ భూమిని కబ్జా చేయాలనుకున్న కబ్జాదారులు సబ్ రిజిస్ట్రార్ ఇచ్చిన అవకాశాన్ని అడ్డం పెట్టి విద్యుత్ బిల్లు, కార్పొరేషన్‌లో విసిటి వేయించుకుని హైకోర్టులో రిజిస్టర్ డాక్యుమెంట్ అడ్డంపెట్టి స్టేటస్ కో తెచ్చుకున్నారన్నారు. ఇలాంటి భూములు రిజిస్ట్రేషన్ చేయకూడదని నిబంధన ఉన్నా కబ్జాదారులు ఇచ్చిన ముడుపులు తీసుకుని సబ్ రిజిస్టర్ అధికారులు ఎలాంటి జంకు లేకుండా రిజిస్ట్రేషన్ చేశారన్నారు. గతంలో ఈ భూమి విషయంపై అనేక వివాదాలు తెరపైకొచ్చిన సందర్భంలో ఓ రెవెన్యూ అధికారి కూడా సస్పెన్షన్‌కు గురయ్యారని గుర్తు చేశారు. అధికారులు కూడా భూకబ్జాలపై పత్రికల్లో కథనాలు వచ్చిన సందర్భంలో స్పందించి అక్కడ ఒక బోర్డు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారని, మళ్లీ కొంత కాలానికే కబ్జారాయుళ్లు మళ్ళీ వాటిని కబ్జాలకు పాల్పడుతున్నారని వాపోయారు. ఇలా కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములు కబ్జాల పాలవుతున్నాయన్నారు. కలెక్టరేట్ సమీపంలో కబ్జా గురైన ఈ భూమి విషయమై త్వరలోనే కలెక్టర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కబ్జా గురైన ఈ భూమిని నిరుద్యోగులుగా ఉన్న దళితులకు యువకులకు చిరు వ్యాపారాలు చేసుకునేందుకు కేటాయించాలని విన్నవిస్తామన్నారు.

శిల్పారామంలో ఆటవిడుపు

ప్రజాశక్తి- కడప అర్బన్

కడప శిల్పా రామంలో సాయంత్రం ఆటవిడుపులో భాగంగా సాంస్కృతిక కళావేదికపై మిష్బా మూవీ వారి సహకారంతో కడప నగరానికి చెందిన విజిల్ డాన్స్ అకాడమీ వారు పల్లె జానపదాలు, శాస్త్రీయ నృత్యాలు, సినీ నృత్యాలతో ప్రేక్షకులను ఆకర్షించారు. కోలాగోటున్నాదురో, గోదావరి గట్టు మీద రామ చిలుకవే, ఆయుధపూజ, వచ్చినాయి పీలింగ్ అంటూ స్టెప్‌లతో ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమాలను శిల్పారామం పరిపాలన అధికారి పి.శివ ప్రసాద్ రెడ్డి, ఫీల్డ్ సూపర్‌వైజర్ మధుసూదన్ బాబు పర్యవేక్షించారు.


నృత్యం చేస్తున్న చిన్నారులు

గ్లకోమా ప్రబలితే అంధత్వమే

ప్రజాశక్తి - కడప అర్బన్


మాట్లాడుతున్న శశిబిందు

కంటి వ్యాధులలో గ్లకోమా తీవ్రతరమైందని, గ్లకోమా ప్రబలితే అంధత్వం సంభవించే ప్రమాదం ఉందని ఎల్.వి. ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ గ్లకోమా కన్స ల్టెంట్ ఆప్తల్మాలజిస్ట్ డాక్టర్ శశి బిందు తెలిపారు. ఆదివారం డాక్టర్ రాజశేఖరరెడ్డి ప్రాంగణంలో గ్లకోమా వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా గ్లకోమా ఉన్నవారి సంఖ్య దాదాపు 80 మిలియన్లు ఉందన్నారు. దాదాపు 50 శాతం మందికి అది సోకినట్టు తెలీదని, వ్యాధి ముదిరిన వరకు లక్షణాలు బయటపడవని చెప్పారు. గ్లకోమా తీవ్రదశకు వచ్చేవరకూ లక్షణాలు కనబడకపోవడంతో చికిత్స చేయకపోతే అంధత్వానికి దారితీయవచ్చు అన్నారు. 40 ఏళ్ల వయస్సు పైబడిన ప్రతి 200 మందిలో ఒకరికి, 80 ఏళ్ల పైబడిన ప్రతి ఎనిమిది మందిలో ఒకరికి గ్లకోమా ఉందన్నారు. క్రమబద్ధమైన పరీక్ష ఒక్కటే త్వరిత నిర్ధారణ చేయగలుగుతుందని, దృష్టి వైకల్యాన్ని నివారిస్తుందని చెప్పారు. అధిక మయోపియా (దూరం చూడటానికి మందంగా ఉన్న కళ్ళద్దాలు) ఉన్నవారికి, మధుమేహం ఉన్నవారికి, 4-6 వారాలకన్నా ఎక్కువ కాలం స్టెరాయిడ్లు ఉపయోగించినవారికి గ్లకోమా వచ్చే ప్రమాదం ఉన్నదన్నారు. తరచూ కంటి పరీక్షలు నిర్వహించుకోవడం చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో బీరం శ్రీధర్ రెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్స్ అధినేత బి. సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎపిపిఎస్‌సి పరీక్షలు

ప్రజాశక్తి - కడప

ఎపిపిఎస్‌సి ఫారెస్ట్ రేంజ్, జూనియర్ అసిస్టెంట్ ఇన్ డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి సంబంధించిన పరీక్షలు ఆదివారం ఆరు కేంద్రాల్లో ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 1022 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షల నిర్వహణను ప్రత్యేక అధికారులు పర్యవేక్షించారు. పరీక్షలకు ఆరుగురు లైజెన్ ఆఫీసర్లు, ఆరుగురు చీఫ్ సూపరింటెండెంట్‌లు విధులు నిర్వర్తించారు. ఈనెల 17న ఉదయం, మధ్యాహ్నం పరీక్షలుంటాయి.

అమరజీవి త్యాగం ఆదర్శనీయం

- జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు

ప్రజాశక్తి - కడప


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిఆర్‌ఒ

ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ అప్పట్లో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం వరుసగా 58 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి, చివరికి జాతికోసం ప్రాణాలర్పించి అమరజీవి అయ్యారని పేర్కొన్నారు. దేశంలోని భాషా ప్రయుక్త రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలిచిన ఆయన మన తెలుగువారని చెప్పుకోవడం గర్వకారణం అన్నారు. అంతటి మహోన్నత, స్వాతంత్ర్య సమరయోధులు అమరజీవి త్యాగాన్ని తెలుగువారందరూ స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మన దేశ స్వాతంత్ర్యం కోసం గతంలో ఎంతోమంది ప్రాణాలర్పించారన్నారు. జాతి గౌరవం కోసం వారి జీవితాలను ఫణంగా పెట్టిన మహనీయుల సేవలను మననం చేసుకుంటూ, ఈ తరం సమాజానికి స్ఫూర్తిని ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వారి సంస్మరణ సభలను నిర్వహించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం హర్షించదగ్గ విషయం అన్నారు. దృఢ సంకల్పం, ఉన్నతాశయం, అకుంఠిత కార్యదీక్ష, నిబద్ధత, సమయ స్ఫూర్తి వంటి అత్యున్నత విలువలకు అమరజీవి పొట్టిశ్రీరాములు నిలువెత్తు నిదర్శనం అన్నారు. విధి నిర్వహణలో ప్రతి ఉద్యోగికి ఆయన అత్యున్నత విలువలు స్ఫూర్తిదాయకం అన్నారు. తన 25 ఏట భార్య చనిపోవడంతో జీవితంపై విరక్తి కలిగి తన ఆస్తి మొత్తం అన్నదమ్ములకు ఇచ్చి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న మహా త్యాగి అన్నారు. 1930 సంవత్సరంలో సత్యాగ్రహంలో పాల్గొని ఆయన జైలు జీవితాన్ని కూడా అనుభవించారన్నారు. ఒకానొక సందర్భంలో మహాత్మా గాంధీ పొట్టిశ్రీరాములు గురించి ప్రస్తావిస్తూ 'దేశం నలుమూలలా పొట్టి శ్రీరాములు లాంటి మానవత్వం ఉన్న వారు ఉంటే చాలు మన దేశాన్ని సమున్నత స్థానంలో, అత్యున్నత విలువలు నింపగలను" అనే ధీమాను వ్యక్తం చేశారంట ఆయన ఎంతటి ఆశయ సాధకులో ప్రస్ఫుటమవుతోందన్నారు. తెలుగు వారి ఆత్మ గౌరవం కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని గాంధేయ మార్గంలో పోరాటం చేసి ప్రాణాలర్పించిన అమర జీవి త్యాగాన్ని ఈ తరం యువత గుర్తించుకోవాలని చెప్పారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి డిఆర్‌ఒతోపాటు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎసి కార్పొరేషన్ ఈడి రాజ్యలక్ష్మి, కలెక్టరేట్ అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహనీయుడు పొట్టి శ్రీరాములు : ఎస్‌పి

కడప అర్బన్ : సమాజం కోసం జన్మించిన వారిలో పొట్టి శ్రీరాములు అగ్రగణ్యుడని ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ కొనియాడారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 124 వ జయంతిని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి, పుష్పాలు సమర్పించి, ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి(అడ్మిన్) కె. ప్రకాష్ బాబు, ఎఆర్ ఎఎస్‌పి బి. రమణయ్య, ఆర్‌ఐ లు ఆనంద్, వీరేష్, టైటాస్, శివరాముడు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

కడప : ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటులో పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్, కడప అసెంబ్లీ నియోజకవర్గం కో-ఆర్డినేటర్ బండి జకరయ్య అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరు పొట్టి శ్రీరాములు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షురాలు సంజయ్ కాంత్, గౌరీదేవి, ఒబిసి జిల్లా చైర్మన్ చిన్నకుల్లాయప్ప, రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి కమల్ బాషా, జహూర్, శీలం గంగయ్య, దినకర్ రెడ్డి పాల్గొన్నారు.

స్వయంఉపాధి రుణాలను సద్వినియోగం చేసుకోండి

- జిల్లాకు 2,143 స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు
- ఇబిసి సహా పలు సామాజిక వర్గాలకు రుణాలు
- త్వరలోనే ఆదరణ-3 పథకానికి మార్గదర్శకాలు
- బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.జయసింహ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



ముఖా ముఖి..

స్వయంఉపాధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి. రాష్ట్రప్రభుత్వం స్వయం ఉపాధి యూనిట్ల ద్వారా యువత ఎదుగుదలకు చేయూత ఇస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని 36 మండలాలు, ఎనిమిది మున్సిపాలిటీలు వెరసి 44 ప్రాదేశిక కేంద్రాల్లోని అర్హుల ందరికీ రుణాలను అందించడంలో భాగంగా బిసి రుణాలు, కాపు నేస్తం, ఇబిసి నేస్తం వంటి పలు పథకాలను వేగంగా అమలు చేస్తోంది. అర్హులైన లబ్ధిదారులకు ఇతోధికంగా సహాయం చేయడంలో భాగంగా మహిళలకు పెద్దపీట వేస్తోంది. ఇదిలాఉండగా మరోవైపు జిల్లాలోని రజక, నాయీ బ్రాహ్మణ, టైలరింగ్ వంటి చేతివృత్తి దారులను ఆదుకునే ప్రయత్నమూ చేస్తోంది. ఇదే తరహాలో కాపు నేస్తం పథకంలో భాగంగా కాపు, ఒంటరి, బలిజ, తెలగ కులాల, ఇబిసి కులాల వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు పెద్దపీట వేస్తోందని పేర్కొంటున్న బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.జయసింహతో ముఖాముఖి...

స్వయం ఉపాధి యూనిట్ల వివరాలు తెలపండి?

కడప జిల్లాకు రూ. 48.63 కోట్లతో కూడిన 2,143 స్వయం ఉపాధి యూనిట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో బిసిలకు 1,550, ఇబిసిలకు 71, బ్రాహ్మణులకు 8, కమ్మకు 17, కాపులకు 379, క్షత్రియులకు నాలుగు, రెడ్డి సామాజిక వర్గానికి 98, వైశ్యులకు 16 చొప్పున యూనిట్లు మంజూరయ్యాయి. బిసిల తరుపున అత్యధికంగా 22,363 దరఖాస్తులు చేసుకోవడమైంది. ఇందులో 12,522 దరఖాస్తులు అర్హత కలిగినవిగా తేలినట్లు సమాచారం.

లబ్ధిదారుల ఎంపిక విధానంపై మాట్లాడండి?

జిల్లాలోని 36 మండలాలు, ఎనిమిది మున్సిపాలిటీలతో కలిపి 44 ప్రాదేశిక ప్రాంతాలకు చెందిన ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, బ్యాంకర్ల కమిటీకి దరఖాస్తులను స్వీకరణ, స్క్రూటినీ, ఎంపిక బాధ్యతల్ని అప్పగించడమైంది. కమిటీ నిర్వహించిన ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి యూనిట్ స్వరూపాన్ని బట్టి రూ .రెండు లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకు రుణాల మంజూరు ప్రక్రియ ఉంటుంది.

స్వయం ఉపాధి రుణాల మంజూరు ఎప్పుడు?

స్వయం ఉపాధి రుణాల మంజూరు ప్రక్రియ వేగవంతమైంది. మొదటి దశలో దరఖాస్తులు స్వీకరించడమైంది. రెండవ దశలో బ్యాంకర్లు, ఎంపిడిఒల కమిటీ దరఖాస్తులను స్క్రూటినైజ్ చేయడమైంది. ఈనేపథ్యంలో త్వరలో బ్యాంకర్ల నుంచి ఎంపిడిఓల లాగిన్‌కు అర్హుల వివరాలు రావడం జరుగుతుంది. అక్కడి నుంచి నెలాఖరు నాటికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లాగిన్‌కు రావడం జరుగుతుంది. అనంతరం రుణాలు మంజూరు ప్రక్రియ చేపట్టడం జరుగుతుంది.

టైలరింగ్ రుణాల వివరాలు తెలపండి?

జిల్లాలో టైలరింగ్ రుణాల మంజూరు చేస్తున్నాం. 2025-26 ఆర్థిక సంవత్సరానికి 4,000 మందికి రుణాలు అందించే ప్రక్రియ నడుస్తోంది. టైలరింగ్ రుణ గ్రహీతలు రోజూ మధ్యాహ్నం వరకు 90 రోజుల పాటు శిక్షణ తీసుకోవాల్సి ఉంది.

కాపు నేస్తం పట్ల ఆదరణ ఎలా ఉంది?

కాపునేస్తం పథకానికి ఆదరణ లభిస్తోంది. 2,827 మంది దరఖాస్తు చేసుకున్నారు. 359 మంది అర్హులుగా తేలారు. 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయస్సు కలిగిన మహిళలు సైతం లబ్ధిదారులుగా ఉన్నారు.

చేతివృత్తుల వారికి ఎప్పుడు మంజూరు చేస్తారు?

రాష్ట్ర ప్రభుత్వం చేతివృత్తిదారుల గురించి సీరియస్‌గా ఆలోచన చేస్తోంది. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఆదరణ-1, ఆదరణ-2 పథకాల కింద సుమారు 33 వేల మందికిపైగా చేతి వృత్తుదారులకు పరికరాల కొనుగోలుకు రుణాలను మంజూరు చేయడమైంది. తాజాగా ఆదరణ-3 పథకం రూపకల్పన ప్రక్రియలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. రాష్ట్రప్రభుత్వ మార్గదర్శకాలు విడుదలైన వెంటనే రుణాల మంజూరు ప్రక్రియను చేపడతాం.

ఫ్యాకల్టీ కొరత గురించి తెలపండి?

ఫ్యాకల్టీ కొరత ఉన్నమాట వాస్తవమే. ఇతర శాఖల నుంచి అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన సిబ్బందిని నియమించుకోవడానికి అనుమతి లభించింది. ఫలితంగా కలెక్టర్ సహకారంతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రుణాలు ంజూరు ప్రక్రియను జయప్రదంగా నిర్వహించడం జరుగుతోంది.

వైవీయూ ప్రయివేట్ డిగ్రీ అండ్ మేనేజ్మెంట్
నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కడప అర్బన్


శ్రీనివాసులు


ఎస్.వి. రమణ

యోగివేమన యూనివర్సిటీ ప్రయివేట్ డిగ్రీ అండ్ మేనేజ్మెంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నగరంలోని స్క్వేర్ సమావేశ మందిరంలో అసోసియేషన్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రాజంపేట గీతాంజలి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సంభావు వెంకట రమణ, కార్యదర్శిగా ముద్దనూరు వెంకటేశ్వర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా నాగేశ్వరరెడ్డి, జయప్రకాశ్ రెడ్డి, కోశాధికారిగా ఆలీ అక్బర్, సంయుక్త కార్యదర్శిగా ఎన్.సంజీవరెడ్డి, రవి శేఖర్ రెడ్డి మిగిలిన సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రయివేట్ డిగ్రీ కళాశాల సమస్యలపై పోరాటాల నిర్వహిస్తామని తెలిపారు. కళాశాల అనుమతులు ఐదు సంవత్సరాలకు ఒకసారి రెన్యువల్ చేసేలా కృషి చేస్తామని చెప్పారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర నాయకులు జి.వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ, సింగిల్ మేజర్ సబ్జెక్టులతో డిగ్రీ విద్యా వ్యవస్థ అంతా దీనమైన పరిస్థితిలోకి నెట్టి వేయబడిందని ఆవేదనవ్యక్తం చేశారు. సమావేశంలో మాజీ అధ్యక్షులు మదనమోహన్ రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, పెంచలయ్య, రాజగోపాల్ రెడ్డి, పోలా రమణారెడ్డి, రాష్ట్ర నాయకులు పి.సురేష్, విజయ్ కుమార్, మనోహర్ రెడ్డి, రాఘవరెడ్డి, సంజీవరెడ్డి, నరసింహులు ప్రతినిధులుగా హాజరయ్యారు.

పేద కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని కాగితాలపెంటలో ఉన్న కింగ్‌ప్యాలెస్ ఫంక్షన్‌హాల్‌లో పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని లజనతుల్ ఉలమా వెల్ఫేర్ సొసైటీ సెక్రటరీ మౌల్వి ఖాజీ షేక్. మొహమ్మద్ అలీ రషది ఆధ్వర్యంలో పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మత గురువులు మౌల్వి అబ్దుల్ సలాం సాబ్, మౌల్వి అక్బర్ అలీ సాబ్, ఖాజీ సిరాజుద్దీన్ సాబ్, మౌల్వి కరీముల్లా సాబ్, ముస్లిం ప్రముఖులు నజీర్ అహ్మద్, డాక్టర్ షేక్. రబ్బానీ, షాహి ఆజం, మన్సూర్ అలీ ఖాన్, తాహిర్, అబ్దుల్ రెహమాన్, అక్రమ్, ఖాజా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొమ్మిదేళ్ల నుంచి లజనతుల్ ఉలమా సొసైటీ వారు పవిత్రమైన రంజాన్ మాసంలో ఇటువంటి సేవలందించడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. 220 పేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ హాఫిజ్ సయ్యద్ అస్గర్ అలీ, ట్రెజరర్ హాఫిజ్ నూరుల్లా, సభ్యులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఆప్ నాయకులు

బాలికలకు పటిష్ట భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థినులకు పోలీసులు, విద్యా శాఖ అధికారులు పటిష్ట భద్రత కల్పించాలని ఆమ్ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా, దాదాపీర్ కోరారు. ఆదివారం వేంపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ సోమవారం నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం అవుతుండడంతో ఆకతాయిలు కూడా ఎక్కువ అవుతారని చెప్పారు. విద్యార్థినులు పరీక్ష కేంద్రాలకు హాజరయ్యే సమయంలో మోటర్ బైకుల రైజింగ్, సైలెన్సర్ సౌండ్ పొల్యూషన్‌తో ఒక్కో బైకులో నలుగురు ఎక్కి బాలికల పట్ల అకతాయి చేష్టలు చేసే అవకాశం ఉందన్నారు. ముందు జాగ్రత్త చర్యగా పరీక్షలు పూర్తయ్యే వరకు పోలీసులు నిఘా పెట్టాలని కోరారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను పరీక్ష కేంద్రాలకు పిలుచుకొని వచ్చి జాగ్రత్తగా మళ్లీ ఇంటికి తీసు కెళ్లాలని వారు కోరారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆమ్ఆద్మీ పార్టీ నాయకులు పీరుబాషా, గౌస్ పాల్గొన్నారు.



హాస్టల్ ప్రహరీ ముందు సంచరిస్తున్న పందులు

వసతి గృహం చుట్టూ పందుల స్వైరవిహారం

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు సాంఘిక సంక్షేమ బాలుర వసతి గహం చుట్టూ పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. వసతి గృహ పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండడంతో పందులు హల్‌చల్ చేస్తున్నాయి. హాస్టల్ ప్రహరీ పక్కలోనే పందులు ఉంటున్నాయి. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా పక్కనే ఉన్న బాలుర ఉన్నత పాఠశాలలో ప్రవేశించి ఇష్టారాజ్యంగా తిరుగుతున్నాయి. విద్యార్థులు భోజనం చేసే సమయంలో వంటశాల, భోజనశాల, విద్యార్థుల చుట్టూ తిరుగుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పందులు గుంపులుగా వచ్చి తోసుకుంటు మీదకి వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. పందుల బెడదను తప్పించి పిల్లలు వ్యాధుల బారిన పడకుండా కాపాడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పెండింగ్‌లో ఉన్న గృహాలకు అదనపు లబ్ధి

- ఎంపిడిఒ రామాంజనేయరెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వివిధ దశల్లో గృహ నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్న బిసి, ఎస్సి, ఎస్టీ లబ్ధిదారులు అదనంగా లబ్ధి పొందడానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ ఎం.రామాంజనేయ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో మండలానికి సంబంధించి బిసి 185 మంది, ఎస్సి 78 మంది, ఎస్టి 16 మంది గృహ లబ్ధిదారులున్నారని, వీరికి ప్రభుత్వం అదనంగా రూ.50వేలు మంజూరు చేసిందన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ కోరారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వ్యక్తిగత మరుగుదొడ్డి లేనట్లయితే కొత్తగా నిర్మించుకొనుటకు ప్రభుత్వం రూ.12వేలు మంజూరు చేస్తుందన్నారు. దరఖాస్తు చేయదలచినవారు మండల హౌసింగ్ ఎఇని సంప్రదించాలని సూచించారు.

పరీక్షలు సజావుగా సాగేందుకు అన్ని చర్యలు

పరీక్షా కేంద్రాలు 10, పరీక్ష రాయనున్న విద్యార్థులు 1,669

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు అన్ని చర్యలు తీసుకున్నామని ఎంఇఒ రామారావు తెలిపారు. పట్టణ పరిధిలో పది కేంద్రాల్లో 1,669 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 84 మంది ఇన్విజిలేటర్ నియమించినట్లు తెలిపారు. పరీక్షలకు సంబంధించి విద్యా శాఖ అధికారులు పకడ్బందీగా ఏర్పాటు చేశారు. నారాయణ పాఠశాలలో 182 మంది, నలంద పాఠశాలలో 240 మంది, జిల్లా పరిషత్ అంకాలమ్మ పాఠశాలలో 150 మంది, వెంకటప్ప మెమోరియల్ పాఠశాలలో 200 మంది, జిల్లా పరిషత్ గర్ల్స్ పాఠశాలలో 150 మంది, జిల్లా పరిషత్ రమణప్ప సత్రంలో 147 మంది, జిల్లా పరిషత్ అహోబిలాపురం బిలో 147 పంది, జిల్లా పరిషత్ అహోబిలాపురం ఏ లో 150 మంది, సెంటెన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 150 మంది, స్వామి వివేకానంద పాఠశాలలో 150 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఇఒ వివరించారు.

కాశినాయన ఆశ్రమానికి చట్టబద్ధత అనుమతులివ్వాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

రాయలసీమతోపాటు, రాష్ట్రవ్యాప్తంగా పేరుగాంచిన కాశినాయన మండలంలోని జ్యోతి క్షేత్రానికి ప్రభుత్వం చట్టబద్ధమైన అనుమతులు జారీ చేసి, వెంటనే పునర్నిర్మాణం చేపట్టాలని కాశి నాయన ఆలయ ట్రస్ట్ సభ్యులు కోరారు. మండల పరిధిలోని పుల్లూరు పంచాయతీ నాగ నాథేశ్వరకోన వద్ద ఉన్న కాశినాయన ఆలయ కమిటీ సభ్యులు, రెడ్డి సంఘం ప్రతినిధులు ఆదివారం జ్యోతి పుణ్యక్షేత్రానికి వెళ్లి అక్కడ కట్టడాల కూల్చివేత ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్యోతి క్షేత్రంలో అక్రమంగా కట్టడాలు నిర్మించారని అన్యాయంగా కూల్చడం ఎంతవరకు సబబని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అటవీ అనుమతులు త్వరగా జారీ చేసి కట్టడ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాశి నాయన ఆలయ కమిటీ సభ్యులు కుడుముల గంగిరెడ్డి, మిట్టా శ్రీరాముల రెడ్డి, గుమ్మ నాగిరెడ్డి, ఎరికలరెడ్డి, దుంపలగట్టు రెడ్యం సుబ్బారెడ్డి, బొర్రా సుబ్బారెడ్డి, చిలకల నాగేశ్వర్ రెడ్డి, రెడ్ల సంఘం ప్రతినిధులు కేవీ సుబ్బారెడ్డి, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.



జ్యోతి క్షేత్రానికి అటవీ అనుమతులివ్వాలని కోరుతున్న ఆలయ ప్రతినిధులు

వేంపల్లెలో తాగునీటి సమస్య

పట్టని అధికారులు-దాతల సహకారంతో ట్యాంకర్లతో నీటి సరఫరా



ట్యాంకర్ల ద్వారా నీటిని పట్టుకుంటున్న రెడ్డెయ్య కాలనీ ప్రజలు, దాత వీరభద్ర

ప్రజాశక్తి - వేంపల్లె

వేసవికాలం ఇంకా పూర్తిస్థాయిలో రాక ముందే వేంపల్లెలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి సరఫరా చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయా ప్రాంతాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టిడిపి మండల ఉపాధ్యక్షుడు వీరభద్ర ఆధ్వర్యంలో ఆదివారం తాగునీరు సరఫరా లేని ప్రాంతాలకు సొంత నిధులతో ట్యాంకర్లతో అందజేశారు. వేంపల్లె గ్రామానికి సమీపంలోనే పాపాఘ్ని నది ఉన్నప్పటికీ అధికారులు, గత పాలకుల నిర్లక్ష్యంతో తాగునీటి ఇబ్బందులు తలెత్తాయి. నీటి ఎద్దడి లేకుండా చేయాలనే ఉద్దేశంతో ఆయా ప్రాంతాల్లో బోర్లు వేసినా ప్రయోజనం లేకుండా పోయింది. రెడ్డయ్య కాలనీ, రాజీవ్‌నగర్ కాలనీ, వివేకానందరెడ్డి కాలనీల్లో కొద్ది రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీలో నీటి సరఫరా చేసే సిబ్బంది ఆ సమయంలో ఆయా ప్రాంతాల్లో పరిశీలించక పోవడంతో ఇబ్బందులు వస్తున్నట్లు ప్రజలు వాపోతున్నారు. ఎప్పుడు పడితే అప్పుడు నీటి సరఫరా చేయడం వల్ల కూలి పనులకు వెళ్లి వచ్చే ప్రజలకు కష్టాలు తప్పడం లేదని అంటున్నారు. తాగునీటి కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివేకానంద రెడ్డి కాలనీ, రెడ్డయ్య కాలనీ, రాజీవ్ నగర్ కాలనీ ప్రాంతాల్లో ప్రజలందరూ కూలి పనులకు వెళ్లే వారే. అందరు ఇంటి వద్ద ఉన్న సమయంలో తాగునీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు. టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నీటి ఎద్దడి లేకుండా శాశ్వత పరిష్కారం చూపడం జరుగుతుందని టిడిపి నేత వీరభద్ర తెలిపారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లోని ప్రజలకు ప్రతి రోజూ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తానని చెప్పారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు



అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె

పొట్టి శ్రీరాములు చేసిన ఆత్మ బలిదానం చరిత్రలో అపూర్వం, నిరుపమానమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు 124వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి ఘనంగా నిర్వహించారు. అనంతరం తులసిరెడ్డి మాట్లాడుతూ మహాత్మా గాంధీ పిలుపు మేరకు స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొని జైలు జీవితాన్ని గడిపారని చెప్పారు. తెలుగు భాష మాట్లాడే వారికోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని 58 రోజులపాటు ఆమరణ నిరహార దీక్ష చేసి అమరుడయ్యాడని గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రమణ్యం, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు బీగాల రామకృష్ణ, చక్రాయపేట మండల శాఖ అధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, వేముల మండల శాఖ అధ్యక్షుడు వెంకటేష్, అమర్నాథ్‌రెడ్డి, నాగరాజు, వేమయ్య, బద్రీనాథ్ పాల్గొన్నారు.



దువ్వూరు : పొట్టిశ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

దువ్వూరు : దువ్వూరు యుపి స్కూల్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆయన జయంతి సందర్భంగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్షులు పేర్ల శేషయ్య ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రజలకు మజ్జిగ పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు ఆరవీటి సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ యాదల్ల రామకృష్ణ, ఆరవేటి నాగేశ్వరరావు, ఈపూరి సత్యనారాయణ, మణికంఠ, రాజేష్, జూటూరు సుబ్రహ్మణ్యం, కొపోలు కిషోర్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఖాజీపేట : ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక బస్టాండు కూడలిలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ గున్నంపాటి వెంకటరమణ, మండల కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు షేక్ హాజీగౌస్, షేక్ ఇస్మాయిల్ మహబూబ్ బాషా, చరిత్రకారులు షేక్ ఇంతియాజుద్దీన్ పాల్గొన్నారు. పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పొట్టి శ్రీరాముల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



పులివెందులలో వైసిపి నాయకులు..

పులివెందుల టౌన్ : అమరజీవి పొట్టి శ్రీరాముల జయంతి వేడుకలను వైసిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పదప్రసాద్ స్థానిక పూల అంగళ్ల వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, వైసిపి పట్టణ అధ్యక్షుడు గంగాధర్ రెడ్డి, కౌన్సిలర్ కిషోర్ మనోహర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాపాడు : చాపాడు శాఖా గ్రంథాలయంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి జె. శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు గాంధీజీకి ప్రియ శిష్యులుగా ఉన్నారన్నారు. బిడిసి రవిశంకర్ రెడ్డి, గ్రామ పెద్దలు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చాపాడు గ్రంథాలయంలో..

'కెసి' ద్వారా రెండు పంటల సాగుకు కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

ఎస్ఆర్-2 నుండి మైదుకూరు ఎర్ర చెరువుకు ఆదివారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ నీటిని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎండాకాలంలో మైదుకూరులో తాగునీటి సమస్య తీర్చేందుకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసేవారన్నారు. తన ఎన్నికల ప్రచారంలో మైదుకూరు మున్సిపాలిటీలోని మహిళలు మీరు గెలిచి.. నీటి కొరత లేకుండా చేయాలి అని అడిగారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మైదుకూరు ఎర్రచెరువుకు నీళ్లు వదులుతున్నామన్నారు. బనకచర్ల నుండి కేసీ కెనాల్ ద్వారా నీటిని అందించి మైదుకూరు నియోజకవర్గానికి రెండు కార్లు పంట పండించుకునేలా కృషి చేస్తానని తెలిపారు. మైదుకూరు నియోజకవర్గాన్ని విద్య, వైద్య పరంగా అభివృద్ధి చేయాలన్నదే తన ధ్యేమన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి రాష్ట్రంలో అగ్రగా మిగా నిలుపుతామన్నారు. బ్రహ్మంగారిమఠం మండలానికి నవోదయ పాఠశాలను మంజూరు చేయించామన్నారు. విద్యారంగానికి ఎంతో ప్రాముఖ్యతనిచ్చి ఐటి శాఖ మంత్రి లోకేష్ చొరవతో నియోజకవర్గానికి నవోదయ పాఠశాల వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనపాల జగన్, టిడిపి పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, మండల శాఖ అధ్యక్షుడు భీమయ్య, చాపాడు మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశాలకు వెళ్లకపోతే రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

శాసనసభకు వెళ్లడం ఇష్టం లేకపోతే పులివెందుల శాసనసభ సభ్యత్వానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజీనామా చేయాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలోని రోడ్డు భవనాల శాఖ అతిథిగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలోని సమస్యలను, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంలో ఎమ్మెల్యే జగన్ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటాడని 60 వేలకుపైగా ఓట్ల మెజార్టీతో ప్రజలు జగన్‌ను గెలిపించారని తెలిపారు. ఎన్నికల్లో 11 సీట్లు వచ్చాయని జనాలను గాలికి వదిలేయడం శోచనీయమన్నారు. వైసిపి ప్రభుత్వ పాలనలో వేంపల్లె పట్టణంలో తాగునీటి సమస్య, రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయని అన్నారు. అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులు ఆగిపోయాయని తెలిపారు. వీటిని జగన్‌రెడ్డి అసెంబ్లీలో చర్చిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించి నిధులు కేటాయిస్తారని అన్నారు. వేంపల్లె పంచాయతీ ఇఒ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. వేంపల్లె పంచాయతీలో పనిచేసిన కార్యదర్శులు బాధ్యతరహితంగా వ్యవహరించారని విమర్శించారు. జగన్ మోహన్ రెడ్డి సమీప బంధువు రవి శంకర్‌రెడ్డి రూ.52 లక్షలు ఎత్తుకెళ్లిన మాట వాస్తవం కాదా అని ఎమ్మెల్సీ ప్రశ్నించారు. తాజాగా సస్పెండ్ అయిన ఇఒ సుబ్బరెడ్డి రూ.1కోటి 88 లక్షలు మింగేశాడని ఆరోపించారు. ఏడాదిగా గ్రామ పంచాయతీ సమావేశం నిర్వహించకుండా వ్యవస్థను నాశనం చేశారని తెలిపారు. మూడు గ్రామ పంచాయతీ సమావేశాలకు హాజరుకకపోతే సర్పంచ్, వార్డు సభ్యుల సభ్యత్వం రద్దు అవ్వాలని, కానీ వేంపల్లె ఇందుకు విరుద్ధంగా జరుగుతోందన్నారు. సర్పంచ్ రాజీనామా చేయకుండా కనీసం ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇన్‌ఛార్జిగా శ్రీనివాసులు కొనసాగడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. రెండు రోజుల్లో సమర్థవంతమైన పంచాయతీ కార్యదర్శిని నియమించి ప్రజలకు వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ప్రతి వీధికి తాగునీటిని అందిస్తామని తెలిపారు. సమావేశంలో డివి సుబ్బారెడ్డి, మాజీ ఎంపిటిసి జివి రమణ, జయచంద్రారెడ్డి, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, పోతిరెడ్డి శివ, కావలి భాను కిరణ్, పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి



తొండూరు కాలువకు నీరు నిలిపివేత

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని పులివెందుల బ్రాంచ్ కెనాల్ పరిధిలో తొండూరు డిస్ట్రిబ్యూటరీ కాలువకు నీరు నిలిపేశారు. కొన్ని రోజులుగా చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి నీటిని రైతుల అవసరాల మేరకు విడుదల చేశారు. ప్రస్తుతం చెర్లోపల్లి పంప్‌హౌస్ నుంచి పిబిసి చివరి ఆయకట్టుకు నీరు పోవడానికి ఒక మోటర్ సాయంతో వంద క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. రైతుల అవసరాల మేరకు నీటి విడుదల చేస్తాం.. పులివెందుల బ్రాంచ్ కెనాల్ పరిధిలోని రైతుల అవసరాల మేరకు నీటి తడులు అందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ఇఇ రాజశేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చిత్రావతి రిజర్వాయర్‌లో 6.9 టిఎంసి నీరు నిలువ ఉందన్నారు. త్వరలోనే తొండూరు డిస్ట్రిబ్యూటరీకి మళ్లీ నీటి విడుదల చేస్తామన్నారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కూలీలకు వరం 'ఉపాధి'

ప్రజాశక్తి - ఖాజీపేట

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కూలీలకు వరంగా మారింది. స్థానికంగానే ప్రజలకు పని కల్పించాలన్న లక్ష్యంతోపాటు కూలీల వలసలను నివారించాలన్న ధ్యేయంతో ప్రతి కుటుంబానికి ఏడాదికి 100 రోజుల చొప్పున ప్రభుత్వం పని కల్పిస్తోంది. ఒక్కో కూలీకి సగటున రోజుకు సంసరి రూ.300 లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వేసవికాలం కావడంతో వ్యవసాయ పనులు ముగియడంతో గ్రామీణ ప్రాంత ప్రజానీకం ఉపాధి హామీ పనుల వైపు మొగ్గుచూపుతున్నారు. మండల వ్యాప్తంగా 6,487 కుటుంబాలు ఉపాధి చట్టాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరికి పని కల్పిస్తున్నా.. పని చేసే ప్రాంతంలో కనీస సదుపాయాలు అందుబాటులో ఉండడం లేదని కూలీలు పేర్కొంటున్నారు. పని జరిగే ప్రాంతాల్లో కనీస సదుపాయాలు అందుబాటులో ఉంటే మరింత మందికి ప్రయోజనం చేకూరుతుందని కూలీలు అంటున్నారు. ఉపాధి హామీ ద్వారా పని లభించాలంటే కొత్తగా జాబ్ కార్డులు మంజూరు చేయాలని మరికొందరు కూలీలు పని కోసం కోరుతున్నారు.

ఎఎస్‌డబ్ల్యూఒ గురు ప్రసాద్‌ను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు ఎఎస్‌డబ్ల్యుఒ గురుప్రసాద్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు రోజులు క్రితం జమ్మలమడుగు ఎస్‌సి కాలేజీ హాస్టల్‌లో డిగ్రీ విద్యార్థిని ఆత్మ హత్య చేసుకుందని, ఇందులో సంబంధిత హాస్టల్ వార్డెన్, పర్యవేక్షణాధికారిగా గురుప్రసాద్ నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతోందన్నారు. గతంలో ఇక్కడ ఎఎస్‌డబ్ల్యుఒ కార్యాలయం ఉండేదని, అధికారి నిత్య పర్యవేక్షణ జరిగేదన్నారు. ఇక్కడున్న కార్యాలయాన్ని ప్రొద్దుటూరులో ఏర్పాటు చేశారన్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఎప్పుడు వస్తారో.. రారో తెలియని పరిస్థితి అన్నారు. గతంలో ఎస్‌సి కాలేజీ హాస్టల్‌లో ఇద్దరు అమ్మాయిలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని తెలిపారు. అప్పుడే ఆయన వార్డెన్ ప్రభావతిపై చర్యలు తీసుకొని ఉంటే ఇప్పుడు ఇలా జరిగి ఉండేదికాదన్నారు. ఆయనపై సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయబోతున్నామని తెలిపారు. సమావేశంలో పట్టణ ఉపాధ్యక్షులు సుబహాన్, సభ్యులు యాసిన్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు

స్టైఫండ్ పెంచే వరకూ దీక్ష విరమించేదిలేదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

తమకు స్టయిఫండ్ పెంచాలని 42 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న పశు వైద్య కళాశాల జూనియర్ డాక్టర్లతో ఆదివారం ఎపి విసి ఛైర్మన్ డాక్టర్ లక్ష్మయ్య, సంస్కృతి స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడారు. దీక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పశువైద్య విద్యార్థులకు ఇస్తున్న స్టయిఫండ్‌ను ప్రభుత్వం పెంచే ఆలోచనలో ఉందన్నారు. ధర్నా విషయంలో మీకు న్యాయం జరిగేలా ప్రభుత్వంతో మాట్లాడుతామన్నారు. దీక్ష విరమించి క్లాసులకు వెళ్లాలని విద్యార్థులకు సూచించారు. ఇందుకు విద్యార్థులు స్పందిస్తూ తమకు న్యాయం జరిగే వరకు దీక్ష విరమించేదే లేదన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న లక్ష్మయ్య

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా స్థానిక శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పిల్లలు, పెద్దలు ఆటపాటలతో ప్రాంగణమంతా సందడిగా మారింది. డ్యాన్స్ మాస్టర్ కిషోర్, కిషోర్ డ్యాన్స్ అకాడమీ, కడప చిన్నారులు నిర్వహించిన నృత్య కార్యక్రమాలు అలరించాయి. చిన్నారులను ప్రేక్షకులు తమ కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు. కార్యక్రమ ఏర్పాట్లను శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఫీల్డ్ సూపర్‌వైజర్ ఇస్మాయిల్, సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు